ప్రజాశక్తి

బుధవారం 1 నవంబర్ 2023 | 5 | శ్రీ సత్యసాయి

మున్సిపల్ కార్యాలయం వద్ద వాదించుకుంటున్న వైసిపి కౌన్సిలర్లు

'అనంత'మైన నిర్లక్ష్యం

◆ అభివృద్ధి.. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే.. ◆ ప్రాజెక్టు పనుల్లో పురోగతి శూన్యం

◆ నేడు 'అనంత'కు చేరనున్న సిపిఎం ప్రజా రక్షణభేరి యాత్ర

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

దేశంలోనే అత్యల్ప వర్షపాతం కలిగిన అనంతపురం జిల్లా అభివృద్ధి పట్ల పాలకుల అంతులేని నిర్లక్ష్యం నెలకొంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ ఈ ప్రాంతాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు నామమాత్రంగానే ఉంటున్నాయి. దీంతో ఇప్పటికీ కరువు, వలసలు, రైతు ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నాయి. ఎన్నికలకు ముందు అధికార, ప్రతిపక్ష పార్టీలు పెద్దఎత్తున హామీలివ్వడం, అధికారంలోకి వస్తూనే వాటి అమలు గురించి చర్యలు చేపట్టకపోవడంతో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది.

పడకేసిన ప్రాజెక్టులు

వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన అనంతపురం జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల్లో పురోగతి పూర్తిగా పడకేసింది. హంద్రీనీవా ప్రాజెక్టును 3800 క్యూసెక్కుల నుంచి ఆరు వేల క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యానికి పెంచుతామని వైసిపి అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలోనే ప్రకటించారు. ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తరువాత జరిపిన తొలి పర్యటన 2019 అక్టోబరు 10వ తేదీన హామీనిచ్చారు. ఈ మేరకు ఆర వేల కోట్ల రూపాయలతో టెండర్లు సైతం పిలిచారు. ఇప్పటికీ పనులు మొదలవ్వలేదు. ఇక అంతకుమునుపే పురోగతిలోనున్న భైరవానితిప్ప ఎత్తిపోతల పథకాన్ని 60 రోజుల్లో పూర్తి చేస్తామని 2021 జులై 8వ తేదీన హామీనిచ్చారు. ఇందుకు సంబంధించి ఇప్పటికీ భూసేకరణయే పూర్తవలేదు. పేరూరు ఎత్తిపోతల పథకం పనుల పరిస్థితి అదే రకంగా ఉంది. ఇక తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణ పనులు 2008లో ప్రారంభమయ్యాయి. రూ.400 కోట్లతో చేపట్టిన పనుల్లో రూ.300 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి. తక్కిన పనులు పూర్తవలేదు. అర్థాంతరంగా పనులు ఆగిపోవడంతో గట్లు బలహీనపడ్డాయి. ఎప్పుడు ఎక్కడ గండపడుతుందోనని అధికారులు బిక్కుబిక్కుమంటున్నారు. పూర్తి స్థాయి సామర్థ్యంతో నీటిని తీసుకోలేకపోతున్నారు. ఇలా అనేక సంవత్సరాలుగా ప్రధానమైన ప్రాజెక్టుల పురోగతి సాగుతోంది. బొమ్మనహాల్ మండలం నేమకల్లులో కుదురేముఖ్ ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు 2012లో ఒప్పందం జరిగితే ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ఇది ఏర్పాటై ఉంటే ప్రత్యక్షంగా మూడు వేల మందికి ఉపాధి లభించి ఉండేది. ఈ పాలకులు ఈ ప్రాజెక్టు ఊసే ఎత్తకపోవడం గమనార్హం.

పూర్తి కాకుండా ఆగిన హంద్రీనీవా కాలువ పనులు

కేంద్ర ప్రాజెక్టుల పరిస్థితి మరింత అధ్వానం

రాష్ట్ర విభజన సమయంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఒక్కటీ పూర్తవ లేదు. కేంద్రీయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు చేస్తామని ప్రకటించారు. దీన్ని 2018లో ప్రారంభించారు. కాని ఇప్పటికీ అద్దె క్యాంపస్‌ల్లోనే తరగతులు నడుస్తున్నాయి. అరొకర నిధులు కేటాయింపులతోనే సరిపోతోంది. ఇక బెల్, నాసన్ పనులు పూర్తవలేదు. నత్తనడకన నడుస్తున్నాయి. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి మూడు సంవత్సరాలకు రూ.150 కోట్లు మంజూరు చేసి ఆ తరువాత నిలిపివేశారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని డిమాండ్ వస్తోంది.

నేటి నుంచి ఉమ్మడి అనంతపురం జిల్లా సిపిఎం ప్రజారక్షణభేరియాత్ర సాగనుంది ఇలా..

తేది	ప్రాంతం	సమయం
1-11-23	తాడిపత్రి	సా॥4-30గం॥
	గుత్తి	రా॥6-30గం॥
2-11-23	పామిడి	ఉ॥9గం॥
	అనంతపురం	ఉ॥10-30గం॥
	రాప్తాడు	మ॥12గం॥
	పెనుకొండ	మ॥1గం॥
	హిందూపురం	సా॥5గం॥
	పుట్టపర్తి	రాత్రికి
3-11-23	నల్లమాడ	ఉ॥9గం॥
	కదిరి	ఉ॥11గం॥

'మధ్యాహ్నం కదిరి నుంచి మలకలచెరువు మీదుగా అన్నమయ్య జిల్లాలోకి యాత్ర ప్రవేశిస్తుంది'.

నేటి నుంచి సిపిఎం ప్రజారక్షణ భేరి

అసమానతల్లేని అభివృద్ధికై ప్రజారక్షణ భేరి యాత్రను సిపిఎం చేపట్టింది. అక్టోబరు 30వ తేదీన కర్నూలు జిల్లాలో యాత్ర ప్రారంభం అయ్యింది. కడప మీదుగా బుధవారం నాడు అనంతపురం జిల్లాకు చేరుకోనుంది. సాయంత్రం 4.30 గంటలకు తాడిపత్రి పట్టణానికి చేరుకోగా, 6.30 గంటలకు గుత్తి పట్టణానికి చేరుకుంటుంది. రాత్రి బస అనంతరం 2వ తేదీన ఉదయం పామిడి, అనంతపురం నగరాల్లో యాత్ర కొనసాగనుంది. అనంతరం శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ, హిందూపురం మీదుగా రాత్రికి పుట్టపర్తికి చేరుకుంటుంది. రాత్రి బస అనంతరం నవంబర్ మూడవ తేదీన పుట్టపర్తి నుంచి బయలుదేరి నల్లమాడ మీదుగా కదిరి పట్టణానికి చేరుకోనుంది. ఆరోజు మధ్యాహ్నం యాత్ర అన్నమయ్య జిల్లాలలోకి ప్రవేశించనుంది. రాయలసీమ వ్యాప్తంగా సాగుతున్న ఈ యాత్రలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డిలతోపాటు అనంతపురం, సత్యసాయి జిల్లాలో సిపిఎం నాయకులు పాల్గొననున్నారు.

అరుపులు.. కేకలు.. బెదిరింపులు..!

◆ కదిరి కౌన్సిల్‌మీట్ రసాభాసా

◆ అధికార పార్టీ కౌన్సిలర్ల విబేధాలు బట్టబయలు

ప్రజాశక్తి-కదిరి అర్బన్

ప్రజా సమస్యలపై చర్చ జరగాల్సిన కౌన్సిల్ సమావేశం వ్యక్తిగత దూషణలకు కేంద్రంగా మారింది. పట్టణ అభివృద్ధిపై చర్చించాల్సిన అధికార పార్టీ వైసిపి కౌన్సిలర్లు ఒకరిపై ఒకరు వ్యక్తిగత దూషణలు చేసుకున్నారు. బూతులు తిట్టుకుంటూ, తొడలు చరుస్తూ ఛాలెంజ్‌లు విసురుకున్నారు. సమస్యల ప్రస్తావన అన్నదే లేకుండా అరుపులు.. కేకలు.. బెదిరింపులతో సమావేశాన్ని ముగించేశారు. కదిరి మున్సిపల్ సర్వసభ్య సమావేశాన్ని ఛైర్‌పర్సన్ నజమున్నీసా అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో అధికార పార్టీ కౌన్సిలర్ల మధ్య పెద్దఎత్తున మాటల యుద్ధం నడిచింది. కౌన్సిలర్ ఆవుల స్వామి మాట్లాడుతూ తన వార్డులో జరిగిన సిసి రోడ్డు పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపు విషయం అజెండాలో పెట్టకపోవడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. బిల్లు మంజూరు విషయం అజెండాలో ఎందుకు కనబరచలేదని అధికారులను నిలదీశారు. ఇందుకు అధికారులు సమాధానం ఇస్తూ బిల్లుల చెల్లింపును ఛైర్‌పర్సన్ భర్త సాధిక్ నిలిపేయించారని చెప్పారు. వెంటనే ఆవుల స్వామి సమావేశంలో ఉన్న సాధిక్ దగ్గరికి వెళ్లి తమ వార్డులో జరుగుతున్న అభివద్ధి పనులను అజెండాలో ఎందుకు కనపరచలేదని ప్రశ్నించారు. ఎవరిని అడిగి పనులు చేశావంటూ సాధిక్ ఎదురు ప్రశ్నించారు. ఈ సమయంలో ఇద్దరి మధ్య మాటామాట పెరిగి తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగింది. ఒకరిపై ఒకరు బూతులు తిట్టుకుంటూ చేయి చేసుకునేంత వరకు పరిస్థితి వెళ్లింది. ఒక్కసారిగా అరుపులు, కేకలతో సమావేశం దద్దరిల్లింది. ఒకరిపై ఒకరు తొడలు కొట్టుకుంటూ 'నీ అంతు చూస్తానంటే.. నీ అంతు చూస్తానంటూ' ఛాలెంజ్‌లు విసురుకున్నారు. తలలు లేపుతామంటూ కూడా ఒకరిపై ఒకరు బెదిరింపులకు దిగారు. ఇదే సమయంలో కౌన్సిలర్లు ఆవుల స్వామికి తోటి కౌన్సిలర్లు కరుణాకర్‌రెడ్డి, మహమ్మద్ తదితరులు మద్దతు తెలిపారు. చేసిన పనులకు బిల్లులు ఆపడం సరికాదన్నారు. చేసిన పనులపై అనుమానాలు ఉంటే అధికారులు, ఛైర్‌పర్సన్ వెళ్లి పరిశీలన చేసి వాస్తవాలు తేల్చాలి గానీ, బిల్లులు ఆపడం సరికాదన్నారు. అనుకూలమైన అజెండాను అమలు చేసుకుని మున్సిపల్ కార్యాలయాన్ని వ్యాపార కేంద్రంగా పెట్టుకున్నారని మరి కొంతమంది కౌన్సిలర్లు సాధిక్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమయంలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు కలుగజేసుకుని కౌన్సిలర్లకు సర్ధిచెప్పే ప్రయత్నం చేశారు. అయినా కౌన్సిలర్లు వినకుండా కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. ఆందోళన విషయం తెలుసుకున్న పట్టణ సిఐ నారాయణరెడ్డి వారి సిబ్బంది మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. ఆందోళన చేస్తున్న కౌన్సిలర్లకు నచ్చజెప్పి శాంతిపజేశారు. అనంతరం సమావేశాన్ని నామమాత్రంగా నిర్వహించి మమ అనిపించారు. అజెండాలోని అన్ని అంశాలను ఆమోదించినట్లు ఛైర్‌పర్సన్ ప్రకటించారు. సమావేశం ముగిసిన అనంతరం కౌన్సిలర్లు ఇంటికి వెళ్తున్న సమయంలో మరోసారి ఘర్షణ వాతావరణం తలెత్తింది. ఛైర్‌పర్సన్ ఆమె భర్త సాధిక్ కొంతమంది కౌన్సిలర్లు బయటకు వెళ్తున్న సమయంలో ఆవుల స్వామి మరికొంతమంది కౌన్సిలర్లు మరోసారి ఛైర్‌పర్సన్ భర్తతో వాదనకు దిగారు. దీంతో ఛైర్ పర్సన్ భర్త, ఆయన మద్దతుదారులు కూడా వారితో ఘర్షణ పడ్డారు. అక్కడే ఉన్న ఉన్న సిఐ మరోసారి కౌన్సిలర్లకు గట్టిగా హెచ్చరించి అక్కడి నుంచి పంపించారు. మొత్తం మీద పట్టణ, ప్రజా సమస్యలపై చర్చ జరగాల్సిన కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు ఇలా ఒకరిపై ఒకరు వ్యక్తిగత దూషణలు చేసుకోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

తహశీల్దార్ తీరుపై దళిత రైతుల ఆగ్రహం

కార్యాలయం ఎదుట ధర్నా

ప్రజాశక్తి - లేపాక్షి

మండలం పరిధిలోని కొండూరు, కోర్లకుంట గ్రామ దళిత రైతుల భూములను అక్రమంగా ఆక్రమించిన కుశలవ సంస్థకు స్థానిక తహశీల్దార్ కొమ్ముకాస్తున్నారని బాధిత రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు కెవిపిఎస్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా రైతులు, నాయకులు మాట్లాడుతూ దళిత రైతుల భూములను ఆక్రమించిన కుశలవ సంస్థకు స్థానిక తహశీల్దార్ కొమ్ము కాస్తూ, ఆ భూముల వివరాలను రెవిన్యూ రికార్డులను తొలగిస్తానని రైతులకు ఫోన్ చేసి మరీ బెదిరిస్తున్నారని విమర్శించారు. రెవిన్యూ రికార్డులను తొలగించకుండా యధాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేదంటే రైతుల ప్రాణాలు తీసి వారి భూములను తీసుకోవాలని భాదితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్య క్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ, భూ పోరాట కమిటీ మండలాధ్యక్షులు గోపాల్, కార్యదర్శి రాము, మల్లి, గంగాధరప్ప, గంగాధర్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ధర్నాలో పాల్గొన్న నాయకులు, దళిత రైతులు

గదుల కేటాయింపుల్లో అవినీతి..!

న్యాయం చేయాలని కౌన్సిలర్, భర్త నిరసన

ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న కౌన్సిలర్ దంపతులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘం పాలకవర్గం అవినీతి మయం అని చెప్పడానికి అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్ దంపతుల నిరసనే ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తోంది. అడ్డదారుల్లో గదుల లీజు వ్యవహారాన్ని నిర్వహించినట్లు ఈ ఘటన స్పష్టం చేస్తోంది. మంగళవారం నాడు ఛైర్‌పర్సన్ ఇంద్రజ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో అధికార పార్టీకి చెందిన 7వ వార్డు కౌన్సిలర్ నసిరాబాను, ఆమె భర్త కింగ్స్ షఫీతో కలిసి నిరసన తెలిపారు. పట్టణంలోని రాజీవ్‌ట్రస్ట్ భవనాల కేటాయింపులో తనకు న్యాయం చేయాలంటూ కౌన్సిలర్ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. పట్టణంలోని పరిగి బస్టాండ్‌లో పురపాలక సంఘం ఆధ్వర్యంలో కొంత స్థలాన్ని రాజీవ్ గాంధీ మెమోరియల్ ట్రస్ట్ వారికి గతంలో అప్పగించారు. ఇక్కడ జరిగిన భవనాల నిర్మాణాలు, గదుల లీజు వ్యవహారంపై పెద్దఎత్తున విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో 7వ వార్డు కౌన్సిలర్ నసిరాబాను భర్త కింగ్స్ షఫీవుల్లా ఈ గదులను తీసుకునేందుకు రూ.35 లక్షలు పాలకవర్గానికి ఇచ్చినట్లు తెలుస్తోంది. గదులను బినామీ పేర్లతో తీసుకునేందుకు కౌన్సిల్‌లో ఆమోదం చేయడం కోసం లక్షల్లో కౌన్సిలర్ల ముట్టజెప్పినట్లు తెలుస్తోంది. ఇలా పాలకవర్గానికి లక్షల్లో ముడుపులు ఇచ్చి బినామీ పేర్లతో గదులను స్వాధీనం చేసుకున్న కౌన్సిలర్ భర్త కింగ్స్ షఫీవుల్లా ఆ గదులను ఇతరులతో పెద్ద మొత్తంలో అడ్వాన్సులు తీసుకుని అద్దెకు ఇవ్వడానికి ప్రయత్నం చేశారు. అయితే వీటిని తీసుకునేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఈ విషయాన్ని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ ఛైర్మన్ జబీవుల్లాలకు వివరించారు. గదులను వేరేవారికి కేటాయించి, పాలకవర్గానికి ఇచ్చిన డబ్బులను తిరిగి ఇవ్వాలని గత ఎనిమిది నెలల నుంచి ఈయన కోరుతున్నారు. పలువురు వైసిపి ముఖ్య నేతల వద్ద కూడా ఈ విషయంపై చర్చించారు. అయినా ఈ వ్యవహారం ముందుకు సాగకపోవడంతో మంగళవారం నాడు కౌన్సిల్ సమావేశంలో నిరసనకు దిగారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ న్యాయం చేయాలంటూ ప్లకార్డులను ప్రదర్శిస్తూ కౌన్సిలర్ సమావేశం గది వద్ద కూర్చొన్నారు. దాదాపు రెండు గంటల పాటు ఆ కౌన్సిలర్ దంపతులు కౌన్సిల్ హాల్ నుంచి ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మన్లు, అధికారులను బయటకు వెళ్లనివ్వలేదు. దీనిపై ఛైర్‌పర్సన్ స్పందిస్తూ 20 రోజుల్లో కౌన్సిలర్ దంపతులకు చెల్లించాల్సిన డబ్బులు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

సమస్యలు పరిష్కారం కానప్పుడు సమావేశాలెందుకు.?

అధికారులను నిలదీసిన కౌన్సిలర్లు

ప్రజాశక్తి-హిందూపురం

కౌన్సిల్ ఏర్పడినప్పటి నుంచి ప్రతి నెలా జరిగే కౌన్సిల్ సమావేశంలో వార్డుల అభివృద్ధి కోసం నిధులు కేటాయిస్తున్నారు... అయితే అభివృద్ధి ఎక్కడా జరగలేదు.. అనేక సమస్యలు పట్టణంలో ఉన్నాయి.. వీటిని పరిష్కరించాలని ప్రతిసారీ సమావేశం దృష్టికి తెస్తున్నాం.. అయినా పరిష్కారం కాలేదు.. సమస్యలు పరిష్కారం కానప్పుడు ప్రతి నెలా సమావేశాలు ఎందుకు పెడుతున్నారు..' అంటూ అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్ ఆసీఫ్‌వుల్లా తదితరులు అధికారులు, పాలకవర్గాన్ని ప్రశ్నించారు. మంగళవారం ఉదయం మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ అధ్యక్షతన అత్యవసర కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. టిడిపి కౌన్సిలర్లు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వనికి వ్యతిరేకంగా నినదాలు చేస్తూ సమావేశం హాల్లోకి వచ్చారు. కౌన్సిలర్ రోషన్ ఆలీ రెవెన్యూ విభాగంలో జరుగుతున్న అవినీతిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ ఛైర్‌పర్సన్‌కు వినతిని ఇచ్చారు. మరికొందరు కౌన్సిలర్లు వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులకు వివరించారు. 10వ వార్డు కౌన్సిలర్ పార్వతి తన వార్డుల్లో అక్రమ నల్ల కనెక్షన్ల తొలగింపు విషయం తమ దృష్టికి తీసుకురాకుండా అధికారులు వ్యవహరించడంపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. కౌన్సిలర్ ఆసీఫ్‌వుల్లా మాట్లాడుతూ అభివృద్ధి, సమస్యల పరిష్కారంపై అధికారుల నుంచి ఎలాంటి స్పందనా లేదన్నారు. వాణిజ్య భవనాల అద్దెలు, పన్నుల వసూళ్లలోనూ రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కొనసాగుతోందని తెలిపారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ నిధుల సమస్య కారణంగా సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతోందని సమాధానం ఇచ్చారు. సమావేశం జరుగుతుండగానే అధికార పార్టీకి చెందిన 15 మంది కౌన్సిలర్లు అజెండాలోని 9 అంశాలకు డీసెంట్ ఇవ్వడంతో సమావేశాన్ని మమ అనిపించి ముగించేశారు. ఈ సమావేశంలో వైస్ ఛైర్మన్లు జబీవుల్లా, బలరామిరెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

అజెండాలోని అంశాలకు డీసెంట్ ఇస్తున్న అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లు

విధులకు డాక్టర్లు డుమ్మా

ఇబ్బందుల్లో రోగులు

ప్రజాశక్తి అమరాపురం

మండల పరిధిలోని హేమావతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు, హెల్త్ అసిస్టెంట్లు విధులకు గైర్హాజరవుతున్నారు. ఉన్నతాధికారులు నిర్వహించే మీటింగులకు, ఫీల్డ్ కు హాజరవుతున్నామని స్థానిక ఆసుపత్రి స్టాఫ్ నర్సులతో చెప్పి, పనివేళలో సొంత పనిమీద బయటికి వెళుతున్నారన్న విమర్శలు వినపడుతున్నాయి. ఇదే విధంగా మంగళవారం డాక్టర్లు, సిబ్బంది విధులకు గైర్హాజరయ్యారు. ఈ విషయంపై ఆరా తీస్తే ఉన్నతాధికారుల మీటింగ్‌కు వెళ్లారని ఆసుపత్రిలో సిబ్బంది తెలిపారు. దీంతో జిల్లా స్థాయి ఉన్నతాధికారులను ప్రజాశక్తి సంప్రదించగా అసలు విషయం బయట పడింది. తాము ఎలాంటి మీటింగులకు పిలవలేదని ఉన్నధికారులు చెప్పారు. ఆసుపత్రిలో పనిచేసే ఒక డాక్టరు భార్గవ సెలవులో ఉండగా రెండో డాక్టర్ గైర్హాజరయ్యారని తేలింది. డాక్టరు జయకుమార్, హెల్త్ అసిస్టెంట్‌ను సంప్రదిస్తే తాము బ్యాంకు దగ్గరికి వెళ్లామని, ఫీల్డ్ లో ఉన్నామని తలాతోక లేని సమాధానాలు చెప్పారు. ఇక హెల్త్ సూపర్వైజర్ ఉమాపతి ఎక్కడున్నాడో తెలియలేదని నర్సులు బదులిచ్చారు. విధులకు గైర్హాజర అయ్యారన్న విషయం బయటపడిందని సమాచారం తెలుసుకున్న హెల్త్ అసిస్టెంట్ మధ్యాహ్నం సమయానికి విధులకు హారజై తిరిగి మూడు గంటలకే వెళ్లిపోయారు. ఇప్పటికైనా సంబందిత ఉన్నతాధికారులు స్పందించి స్థానిక ఆసుపత్రిలో డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఖాళీగా ఉన్న వైద్యాధికారి కుర్చీ

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత

ప్రజాశక్తి-హిందూపురం

అట్టడుగు వర్గాల అభివృద్ధి కోసం వైసిపి ప్రభుత్వం కృషి చేస్తోందనివైసిపి ఇన్‌చార్జ్ దీపిక అన్నారు. మంగళవారం పట్టణంలోని 2వ వార్డులో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డులో ఆమె ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, ఎసిపి సునీల్ కుమార్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ బలరామిరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు షాజియా, నాగేంద్రమ్మ, వార్డ్ ఇంచార్జ్ ఫారూఖ్,ఎ, బి బ్లాక్ కన్వీనర్లు సాదిక్, వాల్మీకి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దింపుదాం

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కందికుంట

ప్రజాశక్తి - కదిరి టౌన్

రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని 2024 ఎన్నికలలో గద్దె దింపుదామని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్, జనసేన పార్టీ ఇన్‌ఛార్జి భైరవ ప్రసాద్ అన్నారు. మంగళవారం కదిరి పట్టణంలోని తాయి గ్రాండ్‌లో టిడిపి జనసేన పార్టీల ఇన్‌ఛార్జుల ఆధ్వర్యంలో టిడిపి జనసేన పార్టీల నాయకులు కార్యకర్తలను ఉమ్మడి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అరాచక ప్రభుత్వానికి వ్యతిరేకంగా టిడిపి జనసేన రాష్ట్ర పార్టీల ఆదేశాల మేరకు ఉమ్మడి కార్యాచరణ చేపట్టినట్లు చెప్పారు. అందులో భాగంగా కదిరి నియోజకవర్గంలో ప్రజా సమస్యలపై టిడిపి జనసేన అధ్వర్యంలో కలిసికట్టుగా ఉమ్మడి పోరాటాలు కొనసాగిస్తామన్నారు. నాలుగున్నర సంవత్సరాల నుండి వైసిపి ప్రభుత్వం అవినీతి అక్రమాలతో పాటు రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగిస్తున్న వైసిపి విముక్త ఆంధ్రప్రదేశ్ కోసం టిడిపి జనసేన పార్టీలు పొత్తు పెట్టుకున్నాయని చెప్పారు. దౌర్జన్య పాలన నుండి రాష్ట్రాన్ని రాష్ట్ర ప్రజలను రక్షించుకోవాల్సిన బాధ్యత టిడిపి జనసేన పార్టీలు తీసుకున్నాయని అన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని గద్దె దింపడానికి టిడిపి జనసేన కలిసి పోటీ చేయలని నిర్ణయించుకోవడం శుభ పరిణామన్నారు. చంద్రబాబు నాయుడు పై అక్రమ కేసులు బనాయించినప్పుడు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చంద్రబాబు నాయుడును జైలులో పరామర్శించి వైసిపి ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తూ స్పందించిన తీరు అభినందనీయమన్నారు. వైసిపి ప్రభుత్వాన్ని ధీటుగా ఎదుర్కొనిప్రజలకు అండగా నిలవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. గ్రామాల్లో ప్రతి ఇంటికి తిరుగుతూ వైసిపి ప్రభుత్వం విధానాలను ప్రజలపై మోపుతున్న భారాలను ప్రజలకు వివరించాలన్నారు. అందులో భాగంగా ఇరు పార్టీల అధ్వర్యంలో ఉమ్మడి కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జనసేన ,టిడిపి జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కదిరిలో టిడిపి, జనసేన ఉమ్మడి సమావేశంలో నాయకులు

కదిరిలో సంబరాలు : చంద్రబాబు నాయుడుకు మంగళవారం హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడంపై టిడిపి, జనసేన ఇన్‌ఛార్జులు కందికుంట వెంకటప్రసాద్ ప్రసాద్, భైరవ ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ సర్కిల్ వద్ద బాణసంచా పేలుస్తూ స్వీట్లు పంపిణీ చేస్తు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జన సేన నాయకులు నాయకులు పాల్గొన్నారు.

బాల్య వివాహం నిలుపుదల

ప్రజాశక్తి గోరంట్ల రూరల్

బాల్య వివాహం నిర్వహిస్తున్నట్లు బేటి పడావో బేటి బచావో తో పాటు 1098 చైల్డ్ లైన్ నెంబర్‌కు ఫిర్యాదు అందడంతో అధికారులు స్పందించారు. నవంబర్ 15, 16 తేదీలలో నిర్వహిస్తున్న బాల్య వివాహాన్ని మండల అధికారులు నిలిపి వేయించారు. పాలసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న మండలంలోని వడిగేపల్లి గ్రామానికి చెందిన మైనర్ బాలికకు ఆమె తల్లిదండ్రులను వివాహం చేయడానికి ఏర్పాటు చేశారు. ఈ విషయం ఫిర్యాదు అందడంతో బాలిక తల్లిదండ్రులను తహశీల్దార్ రంగనాయకులు, ఎంపీడీవో రఘునాథ్ గుప్త, సిఐ సుబ్బరాయుడు, మండల విద్యాధికారి గోపాల్, ఐఒఆర్‌డి సుధాకర్, ఐసిడిఎస్ సూపర్వైజర్ రజిత, మహిళా పోలీస్‌తో పాటు ఇతర అధికారులు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. బాల్య వివాహం నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పౌర హక్కుల దినోత్సవం

సోమందేపల్లి : మండల పరిధిలోని నాగినేనిచెరువు తండాలో పౌరహక్కుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్తులకు పౌరహక్కులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి అంజినాయక్, తహశీల్దార్ సురేష్ కుమార్, ఎస్ఐ విజయ్ కుమార్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

తలుపులలో సినిమా షూటింగ్

తలుపుల : మండల పరిధిలోని బత్రేపల్లి, రెక్కమాను మధ్యగల అటవీ ప్రాంతంలో మంగళవారం యాత్ర 2 సినిమా షూటింగ్‌ను నిర్వహించారు. షూటింగ్‌ను తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల నుండి ప్రజలు అధికసంఖ్యలో తరలివచ్చారు.

వైద్యులకు సన్మానం

నల్లచెరువు : మండల వ్యాప్తంగా జగనన్నఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నేపథ్యంలో మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ రమణారెడ్డి ఎంపీడీవో శకుంతల ఆధ్వర్యంలో వైద్యసిబ్బందిని మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా డాకర్టు ఐనొద్దీ న్, నాగార్జున రెడ్డి, అనురాధ, రోజా, సునీత, అశ్వర్థరెడ్డిలను సన్మానించి,వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు, పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ వర్ధంతి

ప్రజాశక్తి - కొత్తచెరువు

మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకుడు నజీర్ అహ్మద్ అన్నారు. ఇందిరగాంధీ వర్ధంతిని పాత ఆంధ్ర బ్యాంకు వద్ద వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఇందిర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మోహన్, మారాల ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ ధర్మవరం పీసీసీ డెలిగేట్ నిషార్ అహమ్మద్ నివాసంలో ఇందిరా గాంధీ చిత్రపటానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు. భారత దేశ ప్రధానిగా ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కన్వీనర్ బాసినేని ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి వేడుకలను మంగళవారం స్థానిక కాంగ్రెస్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బాలాజీ మనోహర్, నాయకులు హరిత, శ్యాం కిరణ్, అమానుల్లా, జమీల్, తిరుపాల్, ఫయాజ్, సుహెబ్ ఖాన్, గంగాధరప్ప తదితరులు పాల్గొన్నారు.

5న ఉచిత కంటి వైద్యశిబిరం

ధర్మవరం టౌన్ : పట్టణంలోని బాలుర ఉన్నతపాఠశాలలో నవంబరు 5న యువర్స్ ఫౌండేషన్ సౌజన్యంతో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆ ఫౌండేషన్ అధ్యక్షులు శ్రీనివాసులు, కార్యదర్శి సుంకు సుకుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం వారు స్థానిక స్వాతి క్లినిక్‌లో కంటి వైద్యశిబిరానికి సంబంధించిన కరపత్రాలను విడుదలచేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కోశాధికారి రాధాక్రిష్ణ. క్యాంపైన్ ఛైర్మన్ శీలానాగేంద్ర, దాతలు డాక్టర్ బీవీసుబ్బారావు, శివప్రసాద్, గరే రమేష్‌బాబు, కోటేశ్వరరావు, ప్రసాద్, బండినాగేంద్ర పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటివైద్యపరీక్షలు

ధర్మవరం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు కంటి వైద్యాధికారి ఉరుకుందప్ప కంటిపరీక్షలు నిర్వహించారు.కంటి లోపం ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి సరిపడు కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, వార్డు ఇన్‌ఛార్జి సుబాన్‌బాషా, ఎఎన్ఎం సరళ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు బత్తలపల్లి విద్యార్థిని

ప్రజాశక్తి బత్తలపల్లి

స్కూల్ గేమ్స్ అండర్ - 17 బాల్ బాడ్మింటన్ పోటీలకు మండలంలోని రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎంపికైనట్లు ఆ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ తెలిపారు. ఈసందర్భంగా ఆయనతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటనాయుడు మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన అనిత రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థిని నవంబర్ 4 నుంచి 6 తేదీ వరకు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో జరిగే రాష్ట్రస్థాయి అండర్ - 17 బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో పాల్గొంటుందని పేర్కొన్నారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల పాఠశాల సిబ్బందితో పాటు వైసిపి నాయకులు బండి వీరనారప్ప, పెదయ్య, పంచాయతీ సెక్రెటరీ పద్మావతి, ఉపాధ్యాయులు శ్రీరాములు, రవీంద్ర, షహీన సుల్తానా తదితరులు అభినందించారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు

ప్రజాశక్తి మడకశిర

పట్టణంలో పట్టణంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆదేశించారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ అధ్యక్షతన మున్సిపల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ పట్టణంలోని 20 వార్డులలో తాగునీటి సమస్య తీవ్రంగా నెలకొందన్నారు. ఇటీవల పట్టణంలోని యాదవకాలనీ కు సంబంధించిన కొంతమంది మహిళలు తన ఇంటివద్దకు వచ్చి తాగునీటి సమస్య గురించి విన్నవించారన్నారు. ఈ రోజు ఉదయం కూడా ఈ సమస్యపై మహిళలు తనకు విన్నవించారని అన్నారు. పట్టణంలో నీటి సమస్య ఎక్కువ ఉంటే ఎందుకు పట్టించుకోలేదని కౌన్సిలర్లను ప్రశ్నించారు. తాగునిటి సమస్యపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే అధికారులను హెచ్చరించారు. కౌన్సిలర్లు ప్రజల్లో ఉంటూ వారి సమస్యలను పట్టించుకోవాలని ఆయన సూచించారు. ఇప్పటికైనా మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు తమ పనితీరును మార్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, కమిషనర్ ప్రభాకర్ రావు, కౌన్సిలర్లు, అధికారులు హాజరయ్యారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయండి

ప్రజాశక్తి -పెనుకొండ

కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం పూర్తి చేయాలని, విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రయివేట్ పరం చేయొద్దని డిమాండ్ చేస్తూ నవంబర్ 8న నిర్వహించే విద్యాసంస్థల బంద్ ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి హర్ష, ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, ఎఐఎస్ఎ జిల్లా అధ్యక్షులు రొద్దం శివకుమార్ కోరారు. ఈమేరకు మంగళవారం పట్టణంలోని వివేకానంద జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడారు. కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం చేపట్టాలని దశాబ్ద కాలంగా జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వాలు మాత్రం శిలాఫలకాలకే పరిమితం అయ్యాయని విమర్శించారు. బ్రాహ్మణి ఉక్కు పరిశ్రమ పేరుతో భారీ పరిశ్రమకు శంకస్థాపన చేసిన ప్రభుత్వం, తరువాత వచ్చిన ప్రభుత్వాలు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని శంకుస్థాపనలు, హామీలకే పరిమితం అయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీమ ప్రాంత ప్రజలను, ఆంధ్రప్రదేశ్‌ను పాలక ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయన్నారు.కడప ఉక్కు పరిశ్రమ వస్తే ఇక్కడ చదువుకున్న విద్యార్థులకు ఇక్కడే ఉపాధి దొరుకు తుందన్నారు. అందుకోసం విద్యార్థులు, యువకులు కలిసి నవంబర్ 8న జరిగే బంద్ ను జయప్రదం చేయాని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేష్, అనిల్, నరసింహమూర్తి, రాజేష్, పవన్, వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఇచ్చిన హామీని నెరవేర్చాలి

ప్రజాశక్తి - చిలమత్తూరు

ఇళ్లు, ఇళ్ల స్థలాలు లేని పేదలకు కలెక్టర్ ఇచ్చిన హామీని అమలు చేయాలని వ్యకాసం జిల్లా అధ్యక్షులు ఫిరంగి ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి స్థలాలు ఇవ్వాలని 43రోజులు గా పేదలు ఆందోళన చేస్తుంటే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని అన్నారు. గత వారం రోజులు క్రితం కలెక్టర్ ఇచ్చిన హామి అమలు చేస్తారన్న నమ్మకం ఉందని అన్నారు. చిలమత్తూరు మండలం కోడూరు గ్రామ పంచాయతీ పరిధిలోని 805 సర్వే నెంబరులో గల భూమిలో గుడిసెలు వేసుకున్న ప్రదేశంలోనే పట్టాలు ఇచ్చి ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు, లక్ష్మి నారాయణ, రామచంద్ర ఇంటి స్థలాల సాధన కమిటీ నాయకులు సదాశివ రెడ్డి, చందు, రహమత్తుల్లా, రియాజ్, శివ, నాగరాజు, చందు, శివ, మణి, చరణ్, మంజు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

'జగనన్న ఆరోగ్య సురక్ష'ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి గోరంట్ల రూరల్

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే శంకరనారాయణ సూచించారు. మండలంలోని పాలసముద్రం గ్రామంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదలకు ఉచితంగా సేవలు అందించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి ప్రతి పల్లెలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకర్ రెడ్డి, ఎంపీపీ ప్రమీల మూర్తి, వైస్ ఎంపీపీ నాగభూషణ్ రెడ్డి, సర్పంచి గంగప్ప, పోతుల రామకృష్ణారెడ్డి, జోకులదిన్నె సుబ్బారెడ్డి, డాక్టర్ బాషా, సమరసింహారెడ్డి, ఐసిడిఎస్ సూపర్వైజర్ రజిత, సిఐ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : జగనన్న సురక్ష ఆరోగ్య పథకాన్ని పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల స్పెషల్ ఆఫీసర్ శివరంగ ప్రసాద్.తెలిపారు కొత్త చెరువులోనే జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జగనన్న సురక్ష ఆరోగ్య వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా 281 మందికి వైద్య చికిత్సలు అందించి వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి రాధా నాగరాజు, తహశీల్దార్ రామాంజనేయరెడ్డి, ఇఒఆర్‌డి సిద్ధారెడ్డి, గ్రామ కార్యదర్శి గోపాల్, సచివాలయ కార్యదర్శులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండల కేంద్రంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత స్కూల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు రాజేంద్ర, జెడ్పీటీసీ తిరుమల సేవే నాయక్, మండల కన్వీనర్ సివి నారాయణరెడ్డి, భాస్కర్, వెంకటేశ్వర రెడ్డి, సర్పంచి లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

వైసిపి బస్సుయాత్రకు స్పందన కరువు

ప్రజాశక్తి - మడకశిర

వైసిపి చేపట్టిన బస్సుయాత్రకు స్పందన కరువైందని మాజీ ఎమ్మెల్యే ఈరన్న విమర్శించారు. టిడిపి నియోజకవర్గం టీడీపీ మాజీ ఎమ్మెల్యే కె.ఈరన్న ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి ఆలయం ప్రక్కన ఖాళీ స్థలం లో మంగళవారం నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమన్వయ సమావేశ నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడుకు మధ్యంతర బెయిల్ రావడంతో పట్టణంలో తెలుగు తమ్ముళ్ల సంబరాలు చేసుకున్నారు. ర్యాలీ గా వెళ్లి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఈరన్న మాట్లాడుతూ నియోజకవర్గంలో నవంబర్ 1వ తేదీ నుండి 45 రోజులపాటు నిర్వహించే బాబు ష్యురిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో చేపట్టే అంశాల గురించి చర్చించారు. వైసీపీ బస్సు యాత్ర తుస్సు యాత్ర అని ప్రజలు చిదరించుకుంటున్నారన్నారు. చంద్రబాబు బెయిల్ మీద బయటకు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైసీపీ ని భూస్థాపితం చేసేందుకు తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సాధికారిక కన్వీనర్ పాండురంగప్ప, మాజీ ఎంపీపీలు ఆదినారాయణ, అశ్వత్థామప్ప, రామకష్ణప్ప, మాజీ మున్సిపల్ చైర్మన్ ప్రకాష్, పార్లమెంట్ అధికార ప్రతినిధి జయరామిరెడ్డి, అగళి ఎంపీటీసీ నాగోజి, కల్లుమర్రి ఎంపీటీసీ నగేష్. మాజీ ఎమ్మెల్యే తనయుడు డాక్టర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఈరన్న

నేడు రాష్ట్ర అవతరణ వేడుకలు : డిఆర్‌ఒ

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా నవంబర్ 1న పుట్టపర్తి లోని సాయి ఆరామం లో వేడుకలు నిర్వహించనున్నట్లు డిఆర్‌ఒ కొండయ్య తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.కలెక్టరేట్ ఆవరణలో ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు జాతీయ పతాకాన్ని ఎగురవేస్తారని అన్నారు. అనంతరం స్థానిక సాయి ఆరామంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు, వారి సిబ్బంది తో కలసి తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

లే అవుట్ ప్రారంభం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం కొటిపి గ్రామ పంచాయతీ ఇస్లాంపూర్ కాలనీ వద్ద సిల్క్ రీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు ఏర్పాటు చేసిన లేవుట్‌ను వైసిపి ఇన్‌చార్జ్ దీపిక మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా లే అవుట్ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిల్క్ రీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు, వైసిసి నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల దినోత్సవం

రొద్దం : పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కస్తూరిబా పాఠశాల విద్యార్థులు మహాత్మ జ్యోతిరావు పూలే విద్యార్థుల చేత ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద నుంచి రొద్దం పురవీదుల గుండ కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వలి బాషా, పోలీసులు, ఆయా పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడు అరెస్టు

కదిరి అర్బన్ : బాలికల పాఠశాల సమీపాన ఆటో స్టాండ్ వద్ద వ్యక్తిపై కత్తితో దాడి చేసిన కేసులో నిందితుడు అశోక్‌ను అరెస్ట్ చేసినట్లు పట్టణ సిఐ నారాయణరెడ్డి తెలిపారు. నిందితుడిని మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నందు అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. కోర్టుకు హాజరుపరచి రిమాండ్ పంపినట్లు సిఐ చెప్పారు.

అనారోగ్యంతో విద్యార్థి మృతి

చిలమత్తూరు : మండల పరిధిలోని కొత్తచామలపల్లి గ్రామానికి చెందిన ఆదినారాయణప్ప కుమారుడు మురళి(13) అనే విద్యార్థి అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతిచెందాడు. మురళి చిలమత్తూరు జడ్పీహెచ్ ఎస్ పాఠశాలలో 8 తరగతి చదువుతున్నాడు. రెండు నెలలుగా పాఠశాలకు రావట్లేదని ప్రధానోపాధ్యాయుడు తెలిపారు.తల్లిదండ్రులను విచారిస్తే కిడ్నీ సంబదిత వ్యాధితో బాధపడుతూ మృతిచెందినట్లు చెప్పారు. అయితే ఇంత చిన్న వయస్సులో కిడ్నీ సమస్య ఎలా వచ్చింది.వంశపార్యపరంగా వచ్చిందా లేక ఇంకేమన్నా కారణాలు ఉన్నాయా తెలియాల్సుంది. దీనిపై మండల వైద్యులు నికేష్‌ను సంప్రదించగా వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.

నిబంధనలను పాటించకపోతే చర్యలు

హిందూపురం : పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలను పాటించకపోతే చర్యలు తీసుకుంటామని వన్‌టౌన్ సిఐ శ్రీనివాసులు హెచ్చరించారు. మంగళవారం గురునాథ్ సర్కిల్ లో ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మైనర్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్, సింగల్ వీల్ డ్రైవింగ్ వల్ల జరిగే దుష్పరిణామాలను విద్యార్థులకు, యువతకు వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

మంచి ప్రవర్తనతో మెలగండి

కదిరి టౌన్ : పాత కేసులలో నిందితులుగా ఉన్న రౌడీ షీటర్లకు పట్టణ సిఐ నారాయణ రెడ్డి కౌన్సిలింగ్ నిర్వహించారు. వారి ప్రవర్తన తీరు పాత కేసులు అడిగి తెలుసుకున్నారు.మంచి ప్రవర్తనతో మెలగాలని సూచించారు.

'సజ్జల'ను కలిసిన 'బత్తల'

కదిరి టౌన్ : రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డిని బిసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, కదిరికి చెందిన వైసిపి నాయకులు డాక్టర్ బత్తల వెంకటరమణ విజయవాడలో మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ కార్యక్రమంలో మాజీ పట్టణ అధ్యక్షులు కెఎస్. బహవుద్దీన్, చికెన్ జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ

కదిరి టౌన్ : కదిరి రూరల్ మండలం, కుమ్మరవాండ్లపల్లి పంచాయతీ పరిధిలోని అర్హులకు ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి పేదవారికి సొంతింటి కల నెరవేర్చాలన్న ఉద్దేశంతో జగన్మోహన్ రెడ్డి చేపట్టిన పేదలందరికీ ఇల్లు కార్యక్రమంలో భాగంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముస్లిముల ప్రత్యేక ప్రార్థనలు

కదిరి టౌన్ : కొన్ని రోజులుగా పాలస్తీనా, ఇజ్రాయిల్ మధ్య జరుగుతున్న భీకర దాడులు, యుద్ధం కారణంగా పాలస్తీనా లోని అమాయక ప్రజలు మృత్యువాత పడుతున్నారు. ప్రపంచ శాంతి రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మెరుగు పడాలని పాలస్తీనా ప్రజలకు మద్దతుగా కదిరి లో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. మంగళవారం పట్టణంలోని ఈద్గా మైదానంలో ముస్లిం పెద్దలు సమీవుల్లా మౌలానా, షహమీర్ ఖాద్రి ఆధ్వర్యంలో పట్టణంలోని ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ ప్రార్థనలో ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఎస్ఎండి , ఇస్మాయిల్, వాల్మీకి పవన్ కుమార్ రెడ్డి, జిలాన్, టిడిపి నాయకులు డైమండ్ ఇర్ఫాన్, ఖాదర్ బాషా, పెద్ద ఎత్తున ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తి అర్బన్ : సత్య సాయి జిల్లా వ్యాప్తంగా ఐసిడిఎస్‌లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఐసిడిఎస్ అధికారిని తెలిపారు. ఈ మేరకు మంగళశారం ఒక ప్రకటన విడుదల చేశారు. నవంబర్ 1 నుంచి ఆదివారం మినహాయించి 7వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించబడతాయని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు ఫారం పొందుట కొరకు ప్రాజెక్టు డైరెక్టర్ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ వారిచే కలెక్టర్ కార్యాలయంలో పొందవచ్చన్నారు. సంబంధిత శాఖ వారి వెబ్ సైట్ లో కూడా దరఖాస్తు ఫారం లభిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ధర్మవరంలో 2కె రన్

ధర్మవరం టౌన్ : పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో మంగళవారం 2కె రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద డీఎస్పీ శ్రీనివాసులు 2కే రన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు డీఎస్పీ శ్రీనివాసులు చేతులమీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ , టూటౌన్ సిఐలు సుబ్రమణ్యం, అశోక్ కుమార్, ట్రాఫిక్ సిఐ శ్యామరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రైలు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి

మడకశిర : విజయనగరం జిల్లాలో ఘోర రైలు ప్రమాదంలో పలువురు సిబ్బంది, ప్రయాణికులు మృతిచెందడం, గాయాలపాలవడం బాధాకరమని దళిత హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంఆర్ హనుమంతు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రైల్వే ప్రమాదాలు - ప్రయాణికుల భద్రతకై ప్రభుత్వం తగిన చర్లయు తీసుకోవాలన్నారు. రైల్వే శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజాసేవ... అభివృద్ధి..!

- జనం మధ్యన నిలిచే నాయకునిగా సరితాల బాషాకు గుర్తింపు
- ఇప్పటికే వార్డులో పలు అభివృద్ధి పనులు
- వ్యక్తిగతంగానూ అపన్నులకు సాయం
- ప్రజాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతానంటున్న కౌన్సిలర్ సరితాల ఆశాబీ, సరితాల బాషా

కౌన్సిలర్ ఆశాబీ, భర్త సరితాల బాషా

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ప్రజలకు సేవ చేయాలన్న ఆలోచన ఆయన్ను ముందుకు నడుపుతోంది.. జనం మధ్యన ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్న తపన మదిలో నింపుకుని ముందుకు సాగుతున్నారు. వ్యక్తిగతంగానూ.. రాజకీయంగానూ ప్రజలకు సేవలు అందిస్తూ తోడుగా నిలుస్తున్నారు. ప్రజాసేవ... అభివృద్ధిని రెండు కళ్లుగా చేసుకుని జనం చేత నాయకునిగా గుర్తింపు పొందుతున్నారు. ప్రజాభివృద్ధిలో తన కుటుంబాన్నీ భాగస్వామ్యం చేసేలా భార్యను కౌన్సిలర్‌గా చేశారు. రాజకీయంగా, ప్రజప్రతిధిగా ఉంటూ ధర్మవరానికి చెందిన 28వ వార్డు కౌన్సిలర్ సరితాల ఆశాబీ, ఆమె భర్త వైసిపి వార్డు ఇన్‌ఛార్జి సరితాల బాషాలు గుర్తింపు పొందారు. వీరు అభివృద్ధికి చిరునామాగా నిలిచి వార్డును అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నారంటూ ఆ ప్రాంత ప్రజలు పేర్కొంటున్నారు.

వార్డు అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

ధర్మవరం మున్సిపాల్టీ పరిధిలో 28వ వార్డుకు ప్రత్యేకత ఉంది. ఇక్కడ ఎల్1, ఎల్2, ఎల్3, ఎల్4, ఇందిరమ్మ, కేతిరెడ్డి కాలనీలు ఈ వార్డులో కలిసి ఉంటాయి. వివిధ సమయాల్లో ప్రభుత్వాలు మంజూరు చేసిన ఇళ్ల స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలను చేసుకున్న ప్రజలందరూ నివాసం ఉంటున్నారు. ధర్మవరం మున్సిపాల్టీ పరిధిలోని దాదాపు 40 వార్డుల పరిధిలో నివసించిన జనం అంతా కూడా ఇక్కడ ఉంటారు. ఇక్కడ జనాభా కూడా దాదాపు 4300 ఉంది. మున్సిపాల్టీలోనే అత్యధిక జనాభా ఉన్న వార్డు ఇదే కావడం విశేషం. ఇలాంటి వార్డుకు వైసిపి పార్టీ నుంచి సరితాల బాషా సతీమణి సరితాల ఆశాబీ కౌన్సిలర్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గత పదేళ్లుగా వారు రాజకీయ జీవితంలో ఉంటున్నారు. గత మున్సిపల్ ఎన్నికల్లో సరితాల ఆశాబీ 28వ వార్డు నుంచి ఏకగ్రీవంగా వైసిపి కౌన్సిలర్‌గా ఎన్నిక అయ్యారు. అప్పటి నుంచి తన భర్త సరితాల బాషాతో కలిసి వార్డు అభివృద్ధిపై దృష్టి సారించారు. వెనుబడిన ప్రాంతంగా చెప్పుకునే ఈ కాలనీలను అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో ప్రత్యేక ప్రణాళికలతో ముందుకెళ్తున్నారు. గతంలో వీధిలైట్లకు కూడా నోచుకుని వార్డులో ఇప్పుడు పలు అభివృద్ధి పనులు జరిగాయి. తాగునీరు, విద్యుత్ దీపాలు, రోడ్లు, మురుగుకాలువలను ఏర్పాటు చేయడంలో సరితాల దంపతులు విశేష కృషి చేస్తున్నారు. రూ.1.90 కోట్ల నిధులతో కేతిరెడ్డి కాలనీ నుంచి రేగాటిపల్లి రోడ్డు వరకు కాలువలు వేయించారు. ప్రస్తుతం కాలనీలో మురుగునీటి కాలువల పనులు జరుగుతున్నాయి. ఇందుకోసం రూ.1.04కోట్లను ప్రభుత్వంతో మంజూరు చేయించుకుని పనులను చేస్తున్నారు.

అపరిష్కృత సమస్యలకు పరిష్కారం

ఎల్1, ఎల్2, ఎల్3, ఎల్4, ఇందిరమ్మ, కేతిరెడ్డి కాలనీలు ఏర్పాటు చేసిన సమయంలో అనేక సమస్యలు ఉండేవి. సరితాల ఆశాబీ కౌన్సిలర్ అయిన తర్వాత వార్డు అభివృద్ధిపై ఆమె భర్త సరితాల బాషా ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యంగా కాలనీలకు ప్రత్యేక పైప్‌లైన్ వేయించి తాగునీటికి శాశ్వత పరిష్కారం చూపారు. ఎక్కడికక్కడ వీధిదీపాలను వేయించారు. ఇక కాలనీకి ప్రధాన సమస్యగా ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నీరు నిలిచే సమస్యను సైతం అతితక్కువ సమయంలోనే పరిష్కరించారు. రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద సైన్సార్ మోటార్‌ను ఏర్పాటు చేసి ఇంకుడుబావిలో నీటిని తొలగించే ఏర్పాటు చేశారు. ఈ సమస్య పరిష్కారం కావడంతో కాలనీకి రాకపోకులు ఇబ్బంది లేకుండా జరుగుతున్నాయి.

సొంతంగానూ కాలనీ అభివృద్ధికి చేయూత

కొత్తగా ఏర్పడిన కాలనీ కావడంతో అక్కడ అన్నింటినీ ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ఓ వైపు ప్రభుత్వ నిధులను తెప్పించడంతో పాటు మరో వైపు సొంత నిధులను కూడా సరితాల బాషా అందించి కాలనీ అభివృద్ధికి సహకరిస్తున్నారు. ఎక్కడా లేని విధంగా సర్వమతాల ప్రజలను దృష్టిలో ఉంచుకుని కాలనీలో ఇప్పటికే ఆలయాలు, మసీదులను ఏర్పాటు చేయించారు. వాల్మీకి విగ్రహాన్ని ఇప్పటికే ఏర్పాటు చేశారు. శ్రీ కృష్ణదేవరాయల విగ్రహ ఏర్పాటుకు పనులు జరుగుతున్నాయి. చౌడేశ్వరి దేవాలయ నిర్మాణ పనులు కూడా జరుగుతున్నాయి. కాలనీలో పాఠశాల అభివృద్ధిలో కూడా సరితాల బాషా ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. కాలనీలో హైస్కూల్ వరకు పాఠశాలను ఏర్పాటు చేయించి అక్కడే విద్యార్థులకు విద్యాభ్యాసం గావించేలా చర్యలు తీసుకున్నారు.

సరితాల బాషా ఆధ్వర్యంలో 28వ వార్డులో నూతనంగా నిర్మించిన మసీదు, ఆంజనేయస్వామి ఆలయం

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం తింటున్న సరితాల బాషా దంపతులు

ఎమ్మెల్యే కేతిరెడ్డి సహకారంతో మరింత అభివృద్ధి

ఎల్1, ఎల్2, ఎల్3, ఎల్4, ఇందిరమ్మ, కేతిరెడ్డి కాలనీల అభివృద్ధే ధ్యేయంగా తాము పని చేస్తున్నాం. ముఖ్యంగా స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అందిస్తున్న ప్రోత్సాహం, సహకారంతో వార్డు అభివృద్ధికి కృషి చేస్తున్నాం. వెనుకబడిన ప్రాంతంగా ఉన్న ఈ కాలనీలు అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందాలన్న ఉద్దేశంతో ప్రత్యేక ప్రణాళికతతో ముందుకు వెళ్తున్నాం. ఇప్పటికే మురుగుకాలువలు, వీధిదీపాలు, తాగునీటి సమస్య, మౌలిక వసతుల కల్పన చేశాం. వ్యక్తిగతంగానూ కాలనీల్లో దేవాలయాలు, మసీదులు, చర్చిల నిర్మాణానికి తోడ్పాటు అందించాం. ఎమ్మెల్యే కేతిరెడ్డి సహకారంతో భవిష్యత్తులో కాలనీని మరింత అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నాం.

సరితాల ఆశాబీ, 28వ వార్డు కౌన్సిలర్,
సరితాల బాషా, వైసిపి వార్డు ఇన్‌ఛార్జి.

చంద్రబాబుకు మధ్యంతర బెయిల్‌పై టిడిపి సంబరాలు

ధర్మవరంలో బైక్‌ర్యాలీలో పాల్గొన్న పరిటాల శ్రీరామ్, తదితరులు

మడకశిరలో టపాసులు పేల్చి సంబరాలు చేసుకుంటున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి -పెనుకొండ

చంద్రబాబుకు హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన సందర్భంగాశ్రీ సత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పార్థసారథి ఆదేశాల మేరకు పట్టణంలో నాయకులు కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ , అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాణా సంచా పేల్చి మిఠాయిలు పంచి పెట్టారు. అనంతరం టీడీపీ కార్యాలయం వద్ద చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అల్లుడు శశిభూషణ్, నాయకులు చిన్న వెంకటరాముడు, అశ్వర్థనారాయణ, షౌకత్, రవి శంకర్, రామలింగ, దత్త రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తలుపుల :చంద్రబాబుకు మధ్యంతర బెయిల్ రావటంతో తెలుగు తమ్ముళ్ల హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోనిమూడు రోడ్ల కూడలిలో బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ముబారక్, రమణ బాబు, విశ్వనాథ్, కుమ్మరి శీన, రామానుజులు తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : చంద్రబాబుకు మధ్యంతర బెయిల్ రావటంతో స్థానిక తెలుగుదేశం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక అంబేద్కర్ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, వాల్మీకి సర్కిల్ తదితర ప్రాంతాల్లో బాణసంచా పేల్చి మిఠాయిలు పంచుకున్నారు. అదేవిధంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టౌన్ కన్వీనర్ సూరి, మాజీ ఎంపీటీసీలు కిష్టప్ప, బాబయ్య, గోపాల్ యాదవ్, కత్తి మారుతి, మురళి, శివప్ప, తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : చంద్రబాబు నాయుడికి మధ్యంతర బెయిల్ మంజూరు కావటంతో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో తెలుగుతమ్ముళ్లు సంబరాలు చేసుకున్నారు. బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మడకశిర పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మనోహర్, నాయకులు లక్ష్మీనారాయణ, కృష్ణమూర్తి, విశ్రాంత ఇంజనీర్ మల్లికార్జున, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు భక్తర్, ప్రధాన కార్యదర్శులు పుల్లయ్య చౌదరి, రంగయ్య గౌడ, క్లస్టర్ ఇన్‌ఛార్జులు తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : చంద్రబాబుకు హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన సందర్భంగా సత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షులు, బి కే పార్థసారథి ఆదేశాల మేరకు ఆయన కుమారుసు సాయి ఆధ్వర్యంలో గురువారం తెలుగుదేశం పార్టీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ నరహరి, హరీష్, మురళి నాగరాజు, రాజప్ప, మోపార్లపల్లి మంజు, ఆది, క్రిష్టప్ప,ఇమామ్, తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : చంద్రబాబు నాయుడుకు బెయిల్ రావడం సంతోషకరమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కుట్రలతో ఎంతోకాలం చంద్రబాబు ప్రజల నుండి దూరం చేయలేరన్నారు. 52 రోజులు చంద్రబాబు ని అక్రమంగా జైలులో ఉంచినందుకు వైసిపి భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు.

తనకల్లు : చంద్రబాబుకు బెయిల్ మంజూరు కావటంతో మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో మంగళవారం తెలుగుదేశం పార్టీ నాయకులు సంబరాలు .జరుపుకున్నారు. పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు తోటకిషోర్, మాజీ ఎంపీటీసీ మహబూబ్ బాషా, వార్డు మెంబర్ దామోదర్, మాజీ ఎంపీటీసీ బాలప్ప, వడ్డే వెంకటరమణ, ఫకీర్ సాబ్, చంద్రప్ప, వి. రమణ, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : చంద్రబాబు నాయుడుకు బెయిల్ రావటంతో బత్తలపల్లి లోనినాలుగు రోడ్ల కూడలిలో టిడిపి నాయకులు సంబరాలు జరుపుకున్నారు. బాణాసంచా పేల్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు నారాయణరెడ్డి, సంఘాల సూరి, సురేందర్ నాయుడు, వెంకటరమణ, రామాపురం కేశవ, బోయపాటి అప్ప స్వామి నాయుడు , వడ్డే కాటమయ్య తదితరులు పాల్గొన్నారు.

బుక్కపట్నం : చంద్రబాబు నాయుడుకు బెయిల్ రావటంతో మండల కేంద్రంతో పాటు మండల వ్యాప్తంగా తెలుగుదేశం నాయకులు సంబరాలు జరుపుకున్నారు. మండల కేంద్రంలోని తేరు కూడలిలో బాణసంచా పేల్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి సత్యసాయి జిల్లాకార్యదర్శి సామకోటి ఆదినారాయణ, టిడిపి మండల కన్వీనర్ మల్లిరెడ్డి, జంగం వెంకటరాముడు, నాయకులు మాజీ ఎంపీటీ బాలు, లావణ్య గౌడ్, సయ్యద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : చంద్రబాబు నాయుడుకు బెయిల్ రావటంతో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఎస్ శ్రీనివాసులు, మాజీ జడ్పిటిసి లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచి శివప్రసాద్, హరినాథ్ చౌదరి, నాగేందర్ ప్రసాద్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలోనే ఎన్టీఆర్ విగ్రహం వద్ద సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి రమేష్ రెడ్డి, సుబ్రమణ్యం, కిష్టప్ప, కేసప్ప తదితరులు పాల్గొన్నారు

పుట్టపర్తి క్రైమ్ : చంద్రబాబు కి బెయిల్ రావడంతో న్యాయం గెలిచింది ప్రజాస్వామ్యం బతికిందని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఈమేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జగన్ రెడ్డి కక్ష పూరిత ధోరణితో వ్యవస్థలను మేనేజ్ చేస్తూ బాబును బంధించాలని కుయుక్తులు పన్నారని ఆరోపించారు. నాలుగు వారాలపాటు బెయిల్ మంజూరు కావడానికి న్యాయానికి దక్కిన విజయంగా భావిస్తున్నామన్నారు. చంద్రబాబుకు బెయిల్ రావడంతో జగన్మోహన్ రెడ్డి గుండెల్లో రైలు పరిగెడుతున్నాయన్నారు.

ధర్మవరం టౌన్ : చంద్రబాబుకు మధ్యంతర బెయిల్ రావడంపై ధర్మవరంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాలశ్రీరామ్ బైకు ర్యాలీ నిర్వహించారు. వందలాది మంది టీడీపీ శ్రేణులతో టీడీపీ జెండాలు పట్టుకుని పట్టణ వీధుల్లో బైకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

పుట్టపర్తి అర్బన్ : చంద్రబాబుకు మధ్యంతర బెయిల్ రావడంతో పుట్టపర్తి పట్టణంలో టీడీపీ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. మంగళవారం మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఆదేశాల మేరకు హనుమాన్ సర్కిల్‌లో టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ నాయకులతో కలిసి బాణాసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

లేపాక్షి : చంద్రబాబు నాయుడికి స్కిల్ కేసులో నాలుగు వారాల మధ్యంతర బెయిల్ ఇవ్వడంతో టిడిపి నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు.బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జయప్ప, ఆనంద్ కుమార్, రవి, చంద్ర , కార్యకర్తలు పాల్గొన్నారు

ధర్మవరం టౌన్ : నారా చంద్రబాబు నాయుడు జైలు నుండి విడుదల కావడం శుభ పరిణామం అని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. ఈ పరిణామంతో ప్రజలందరికీ న్యాయ వ్యవస్థ పై నమ్మకం ఏర్పడిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార వికాస విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెస్త శ్రీనివాసులు, అడ్డగిరి శ్యామ్ కుమార్, కార్యనిర్వాహన కమిటీ సభ్యులు కోటికి రామాంజి, దాడితోట కృష్ణయ్య జివి,మోహన్ నాయుడు , వెంకటేష్, కడవల సుధాకర్ రెడ్డి, దామోదర్, నందా, గంగాధర్, దాసరి లక్ష్మీనారాయణ, హరికృష్ణ, రాఘవ, పెద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : చంద్రబాబునాయుడుకు మంగళవారం హైకోర్టు మధ్యంతర బైలు మంజూరు చేయడంతో పురంలో తెలుగు తమ్ముళ్లు ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ సర్కిల్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, పటాసులు పేల్చి, మిఠాయిలు పంచుకున్నారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : చంద్రబాబునాయుడుకు మధ్యంతరం బెయిల్ రావటంతో మాజీఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ అనుచరులు ధర్మవరంలో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆ తరువాత సర్కిల్లో బాణాసంచా కాల్చారు.ఈ కార్యక్రమంలో గోనుగుంట్ల అనుచరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సమైక్యతా దినోత్సవం

వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

ప్రజాశక్తి -పుట్టపర్తి రూరల్

దేశ భద్రతకు సమగ్రతకు అందరూ పాటుపడాలని అందరి బాగు కోసం కలిసి ఉండాలని భారతదేశాన్ని ఒక్కటిగా చేసిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ పి అరుణ్ బాబు, ఎస్పీ మాధవ్ రెడ్డి పేర్కొన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం రన్ ఫర్ యూనిటీ (ఏక్ దివాస్) కార్యక్రమాన్ని స్థానిక సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వద్ద జిల్లా కలెక్టర్, ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం జిల్లా పోలీస్ కార్యాలయం వరకు కొనసాగింది. జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలో జాతీయ సమైక్యతా దినోత్సవంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ తొలుత సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు.అనంతరం దేశ సమైక్యత, సమగ్రతలకు అంకితభావంతో పాటు పడదామని సిబ్బంది, విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వ్యాచరచన , వక్తృత్వ పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీ విష్ణు, డీఎస్పీ వాసుదేవన్ , ఎఆర్ డీఎస్పీ విజయ్ కుమార్, ఎస్‌బి సిఐ రవీంద్రారెడ్డి, సిఐ లు రాగిరి రామయ్య , కొండారెడ్డి , ఆర్‌ఐలు రాజశేఖర్ రెడ్డి, టైటాస్, నారాయణ, ఆర్ఎస్ఐలు వెంకటేశ్వరరావు, రాజు, ప్రదీప్ సింగ్ , పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ :పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి ని మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేశవరావు మాట్లాడుతూ భారతదేశానికి సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జయప్ప, చరిత్ర విభాగపు అధిపతి డాక్టర్ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

తలుపుల : మండల కేంద్రంలోని సచివాలయంలో జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి సేవాదళ్ జోనల్ ఇన్‌ఛార్జి డికె. బాబు, జె సి ఎస్ కన్వీనర్ రమణ, వార్డు మెంబర్లు మౌలాలి, శ్రీనాథ మేజర్ పంచాయతీ సెక్రటరీ మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల రూరల్ : సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలను గోరంట్ల మండలంలోని పాలసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకరనారాయణ తదితరులు సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పటేల్ దేశానికి చేసిన సేవలు త్యాగాలు గుర్తుకు తెచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రంగనాయకులు, ఎంపీడీవో రఘునాథ్ గుప్తా, మండల విద్యాధికారి గోపాల్, జిల్లా సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్, రైతు విభాగం అధ్యక్షులు పాటూరి శంకర్ రెడ్డి, వైస్ ఎంపిపి నాగభూషణ్ రెడ్డి, సచివాలయం కన్వీనర్, సమరసింహారెడ్డి, ఐసిడిఎస్ సూపర్వైజర్ రజిత, సర్పంచి గంగప్ప, శ్రీనివాస్ రెడ్డి, సుబ్బరాయుడు, ఎసిఐ లక్ష్మీనారాయణ, అగ్రి డైరెక్టర్ లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : మండలపరిధిలోని జవహర్ నవోదయ పాఠశాల తదితర పాఠశాలల్లో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు శివకుమార్, ప్రధానోపాధ్యాయులు నాగరాజు, శేషగిరి బాబు, ఉపాధ్యాయులు ప్రసాద్, భద్రయ్య, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజ్ నందు మంగళవారం జాతీయ సమైక్యత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమములో ప్రిన్సిపల్ విజయలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు, ఎన్ ఎస్ ఎస్ కార్యక్రమం అధికారి ఎం చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : చిలమత్తూరు శాఖ గ్రంథాలయంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఈసందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి మల్లికార్జున, శ్రీనివాసులు, ఫీల్డ్ అసిస్టెంట్ హరి, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హిందూపురం : దేశం గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి సర్దార్‌వల్లభాయ్‌పటేల్ అని బాలయేసు కళాశాల ఎఒ శౌరిరెడ్డి, ప్రిన్సిపల్ బలరామిరెడ్డి అన్నారు. మంగళవారం కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ 147వ జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. అదే విధంగా పట్టణంలోని సప్తగిరి, బాలాజీ, బిట్ ఇంజనీరింగ్ కళాశాల, మహిళా కళాశాల్లో సర్దార్‌వల్లభాయ్‌పటేల్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అదేవిదంగా ఎన్ఎస్పిఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రగతి ఆధ్వర్యంతో ఏక్‌తా దివాస్ ఘనంగా జరుపుకున్నారు.

ధర్మవరం టౌన్ : భిన్నత్వంలో ఏకత్వం, సమైక్యత, సౌభ్రాతృత్వాలకు ప్రతీక భారతదేశం అని మన జాతి ఔన్నత్యాన్ని ప్రపంచదేశాలకు చాటాలని ప్రభుత్వ ఉన్నతపాఠశాల హెచ్‌ఎం శైలజ అన్నారు. సర్దార్ వల్లభాయిపటేల్ జయంతి సందర్భంగా మంగళవారం జాతీయ సమైక్యత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హిందీపండిట్ వేణుగోపాల్, ఉపాధ్యాయులు రామాంజినేయులు, సోమశేఖర్, నాగేంద్ర, దివాకర్, శ్రీహరి ప్రసాద్, పీడీ నాగేంద్ర, నాగరాజు పాల్గొన్నారు.